క్లుప్తంగా

నేడు ఘట్టుపల్లిలో హనుమాన్ వేడుకలు



మూల విరాట్

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చరణాలతో నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఉదయం 5 గంటలకు ఆలయంలో సుప్రభాతం, పంచామృతాభిషేకం, ఉదయం 7 గంటలకు నాగవల్లి పూజ (లక్ష తమలపాకులతో అర్చన), మధ్యాహ్నం ఒంటి గంటకు హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణ చేశారు. శివుడికి పూలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు



వాహనదారుడి పత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై భాస్కర్

పహాడీషరీఫ్: సార్వత్రిక ఎన్నికల కోడ్, బక్రీద్ పండుగలను పురస్కరించుకొని పహాడీషరీఫ్ పోలీసులు వాహనాల తనిఖీలు కొనసాగిస్తున్నారు. డీఎస్సై భాస్కర్ పర్యవేక్షణలో శుక్రవారం సాయంత్రం శ్రీశైలం ప్రధాన రహదారిపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించిన పోలీసులు, నిబంధనలు ఉల్లంఘించిన వారికి చలానాలు విధించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని గోవులను తరలించకుండా తగిన చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ బడులకు మహర్దశ

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలలతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రతి పాఠశాలకు లక్ష రూపాయల చొప్పున కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. గతంలో మండల పరిషత్ నిధుల నుంచి సాంకేతిక పరికరాలు, ల్యాబ్ సామగ్రి, కంప్యూటర్లు అందజేశామని తెలిపారు . ప్రస్తుతం ఒకే మండలంలో 24 పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంగ రవీందర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, మండల ఏఈ ఇంద్రాసేనారెడ్డి, ఎంఈఓ వెంకట్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామాంజనేయ దేవాలయం వద్ద నిలిచిన మురుగు



ప్రశాంత్‌నగర్ ఫేజ్-2లో తాగునీటి పైపులైన్ వద్ద లీకవుతున్న డ్రైనేజీ నీరు

తాత్కాలికంతో జనం అవస్థ!

డ్రైనేజీ పైపులైన్ లీకేజీతో తీవ్ర ఇక్కట్లు

- మరమ్మతులు చేసినా కొద్ది రోజులకే చెదిరిపోతున్న ఆనవాళ్లు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న బస్తీవాసులు

మీర్‌పేట: అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. చేపట్టిన పనిని సకాలంలో, నాణ్యతగా పూర్తి చేయక సమస్యను మరింత సాగదీస్తున్నారు. ఇదీ మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లోని ప్రశాంత్‌నగర్ ఫేజ్-2 పరిస్థితి. తాత్కాలిక మరమ్మతులు చేయడం.. వదిలేయడం.. ఆ తరువాత సమస్య మళ్లీ పునరావృతం కావడం.. ఇదే తంతూ తరచూ జరుగుతోంది. ప్రధాన రహదారిపై ఇటీవల జల మండలి అధికారులు మంచినీటి పైపులైన్ వేయిస్తుండగా అక్కడే ఉన్న డ్రైనేజీ పైపులైన్ పగిలిపోయింది. దీంతో డ్రైనేజీ నుంచి మురుగునీరు పెద్ద ఎత్తున లీకేజీ అవుతోంది. మంచినీటి, డ్రైనేజీ పైపులైన్‌లు పక్క పక్కనే ఉండడంతో ఎక్కడ మంచినీటిలో కలిసి కలుషితం అవుతుందేమోనని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో మురుగునీరంతా రోడ్డుపైనే చేరి రోడ్లన్నీ దుర్గంధంతో మసకబారి పోతున్నాయి. ఇప్పటి కీ మూడుసార్లు సమస్య పునరావృతం అవ్వగా, కా ర్పొరేషన్ అధికారులు తాత్కాలికంగా మరమ్మతు లు చేపట్టి మమ అనిపిస్తున్నారు. అది రెండు మూ డు రోజులకే ఆనవాళ్లు చెదిరి పోయి సమస్య మరలా ఉత్పన్నం అవుతుంది. కానీ సమస్యను గుర్తించి శాశ్వతంగా పరిష్కరించడం లేదని బస్తీవాసులు మొర పెట్టుకుంటున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ లీక్ అవ్వకుండా పరిష్కరించాలని బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దుర్గంధం వ్యాపిస్తోంది

ఇదే బస్తీలో డ్రైనేజీలు పొంగి పొర్లుతూ ఇళ్ల మధ్య తీవ్ర దుర్గంధం నెలకొంటోంది. శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం పక్కనే కొంత కాలంగా మురుగునీరు లీకై నిల్వ ఉండడంతో కంపు కొడుతోంది. దీంతో విపరీతంగా దోమలు ప్రబలుతున్నాయి. దీన్ని ఆనుకునే ఇళ్లు ఉండడంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



క్యాంపు కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్లను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, డివిజన్లలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. జూన్ 2వ తేదీన జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ముగింపు వేడుకలలో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు సన్మానం చేస్తామన్నారు. కలసికట్టుగా వేడుకలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట, బడంగ్‌పేట అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నాయకులు సాజిద్, గోపాల్, ప్రభాకర్, సునీత, లావణ్య, లలితజగన్, ప్రవీణ్‌రెడ్డి, బాలరాజు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొగాకుతో మానవ మనుగడకు ప్రమాదం

ఆమనగల్లు వైద్యాధికారి నరేందర్



పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆమనగల్లు: పొగాకు ఉత్పత్తులను వాడితే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డా.పరిక్షిత్ నరేందర్ మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల నోటి సంబంధిత క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెనొప్పి తదితర సమస్యలు వస్తాయని అన్నారు. చిన్నపిల్లల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఎదురవుతాయని చెప్పారు. సిగరెట్లు, గుట్కా, పాన్‌మసాలాలతో ప్రపంచ మానవాళి మనుగడకు ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జయశ్రీ, మంజుల, సిబ్బంది.. తిరుపతిరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరి, వేణు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఇబ్బంది పెట్టొద్దు

జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హామెద్



అధికారులు చేసిన మార్కింగ్‌ను చూపుతున్న షర్ఫొద్దీన్ హామెద్

పహాడీషరీఫ్: బురాన్‌ఖాన్ చెరువు ముంపు బాధితులను ఇబ్బందులకు గురి చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హామెద్ హెచ్చరించారు. నాలుగు రోజుల క్రితం ఉస్మాన్‌నగర్ చెరువు ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పర్యటించిన అనంతరం మున్సిపాలిటీ సిబ్బంది రెండు రోజులుగా ముంపు ప్రాంతంలోని ఇళ్లకు మార్కింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం షర్ఫొద్దీన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా అధికారులు మార్కింగ్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోనే అప్పటి మంత్రి సబితారెడ్డి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి చెరువు నుంచి నీరు వెళ్లేందుకు తూమ్ నుంచి సాల్తె బామ్ బావి వరకు పైప్‌లైన్ వేయించారన్నారు. ఇళ్లకు అడ్డంగా భారీ కట్టను కూడా నిర్మించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ముంపు బాధితులు ఎలాంటి పుకార్లు నమ్మరాదని, అధికారులు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

ఆమనగల్లు: కడ్తాల మండలం సలార్‌పూర్‌కి చెందిన సాయిలు, గణేశ్‌కు కిడ్నీ మార్పిడి కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.4.10 లక్షల చెక్కులను కడ్తాల జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ శుక్రవారం అందించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో తండ్రి సాయిలు తన కొడుకు గణేశ్‌కు కిడ్నీ దానం చేయగా.. ఆపరేషన్ విజయవంతమైంది. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సహాయంతో వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.4.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రియా రమేశ్, నాయకులు పంతునాయక్, గోపాల్, సీతారాంనాయక్, జైపాల్, శంకర్ తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి

మలక్‌పేట: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం ప్రతినిధులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని నగరంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల పున: ప్రారంభానికే ముందే బదిలీలు పూర్తి చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలు పూర్తి తర్వాతే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలని, గ్రేడ్ -2 ప్రిన్సిపాల్ పోస్టులు మొత్తం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీజీటీ జూనియర్ లెక్చరర్ పోస్టులను 70 శాతం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రసూతి సెలవుల్లో వెళ్లే మహిళా ఉపాధ్యాయులకు ప్రతినెలా వేతనం చెల్లించాలన్నారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంఘం అధ్యక్షుడు ఆవుల సైదులు, ప్రధాన కార్యదర్శి పోలు జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షులు తాడూరి అరుణ్‌కుమార్, ఆవ మల్లయ్య, వై. సంతోష్, సంయుక్త కార్యదర్శి జల్లాపురం చిన్నస్వామి, కోశాధికారి కృష్ణారెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

స్కూళ్ల ప్రారంభంలోపే యూనిఫాంలు

- మహిళా సంఘాలకు కుట్టే బాధ్యత
- ముమ్మరంగా సాగుతున్న స్టిచ్చింగ్ పనులు
- మలక్‌పేట జోన్ పరిధిలో 22,828 మంది విద్యార్థులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు



విద్యార్థుల యూనిఫాంలు కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పాఠశాలల పున:ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే మలక్‌పేట, సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలోని మహిళా సంఘాలకు వస్త్రం ఇచ్చి యూనిఫాంలు కుట్టించే పనులు అప్పగించగా ప్రస్తుతం ముమ్మరంగా కుట్టు పనులు జరుగుతున్నాయి.

- జూన్ 5వ తేదీ నాటికి దుస్తులు కుట్టి ఆయా పాఠశాలలకు పంపించాలని ఈ బాధ్యతలను జీహెచ్ఎంసీ యూసీడీ విభాగాం అధికారులకు అప్పగించారు.
- జీహెచ్ఎంసీ సర్కిల్-6 యూసీడీ డీపీఓ యుగేందర్‌రెడ్డి పర్యవేక్షణలో మహిళా సమాఖ్య సభ్యురాళ్లు గుర్తించిన సెట్విన్ కేంద్రాల్లో యూనిఫాంలు కుడుతున్నారు. గత ఐదు రోజులుగా స్టిచ్చింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.
- మలక్‌పేటలోని సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలో నాలుగు చోట్ల మహిళా సంఘాల సభ్యులు వీటిని కుడుతుండగా, కుట్టుమిషన్లు ఉన్నవారు వస్త్రాన్ని తమ ఇంటికి తీసుకెళ్లి కుడుతున్నారు.
- ప్రతి విద్యార్థికి రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వాలని నిర్ణయించారు.
- ఒక జత కుడితే రూ. 75 చెల్లిస్తున్నారు. మలక్‌పేట జోన్ పరిధిలో దాదాపు 22,828 మంది విద్యార్థుల కోసం వస్త్రాలు పంపిణీ చేశారు. యూసీడీ విభాగం అధికారుల ద్వారా మహిళా సంఘాలకు కుట్టే బాధ్యతను అప్పగించారు.

దుస్తులు ఇలా..

- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల (1–5 తరగతులు, 6,7వ తరగతులు) బాలురకు రెండు చొక్కాలు, రెండు నిక్కర్లు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలు కుట్టిస్తున్నారు.
- బాలికలకు ప్రత్యేక దుస్తులు ఉన్నాయి. పంజాబీ డ్రెస్ మాదిరిగా పైన కోటు వచ్చేలా కుట్టిస్తున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..

మలక్‌పేట పరిధిలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 30 వరకు ఉన్నాయి. సర్కిల్ పరిధిలో వంద మంది మహిళలు విద్యార్థుల యూనిఫాంలు కుడుతున్నారు. తొలిసారి మహిళా సమాఖ్యలకు ఏకరూప దుస్తులు కుట్టే అవకాశం లభించింది. కుట్టు పనులను నిత్యం పర్యవేక్షిస్తూ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– యూసీడీ డీపీఓ యుగేందర్‌రెడ్డి





పర్యవేక్షిస్తున్న యూసీడీ డీపీఓ యుగేందర్‌రెడ్డి, దుస్తులను పరిశీలిస్తున్న డీపీఓ

సామాజిక తనిఖీలపై నేడు మండల నివేదిక

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై నిర్వహించిన గ్రామసభలపై మండల నివేదికను శనివారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఆ బృందం వెల్లడించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతి కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి 29వ తేదీ వరకు గ్రామాలవారీగా ఉపాధి పనులపై తనిఖీలు జరిపి గ్రామ సభలను సామాజిక తనిఖీ బృందం నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల మండల నివేదికను సంబంధిత అధికారులకు ఈ సమావేశంలో వివరిస్తారని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారుల సమక్షంలో ఈ సమావేశం జరుగనున్నట్లు తెలిపారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

మాడ్గుల: కోరం లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ పద్మారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సభకు మెజార్టీ ఎంపీటీసీలు వివిధ కారణాలతో రాలేకపోయారు. సభ నిర్వహించడానికి కావాల్సినంత మంది రాకపోవడంతో సభను వాయిదా వేశామని.. తదుపరి సమావేశం నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందుకూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రమేష్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చర్ల 33 కేవీ, మహ్మద్‌నగర్ 11 కేవీ, దెబ్బడగూడ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నామన్నారు. దీంతో ఆ పరిధిలోని మహ్మద్‌నగర్, దెబ్బడగూడ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. వినియోగదారులు, రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

సరూర్‌నగర్ పరిధిలో..

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సమతాపురి ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ కమలానగర్, హరిపురికాలనీ, రాక్‌టౌన్, హుడాసాయినగర్, విశ్వపార్వతి, దేశ్‌ముఖ్ కాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ విద్యుత్‌నగర్, శారదానగర్, యాదవనగర్, ఇందుఅరణ్య, మన్సూరాబాద్, గణేష్‌నగర్, ఆంధ్రకేసరి నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ విజయపురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు.

మీర్‌పేట పరిధిలో..

మీర్‌పేట: మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మీర్‌పేట ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విరాట్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ మీర్‌పేట ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నారు.

జల్‌పల్లి ఫీడర్ పరిధిలో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆర్.ఆర్.మసాల ఏరియా, యూసుఫ్ కాలనీ, బుగ్గ కాలనీలలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వి.సత్యనారాయణ తెలిపారు. రాజీవ్‌గాంధీనగర్, ముదిరాజ్ కాలనీ, ఉమర్ కాలనీ, ఫారూఖ్‌నగర్, చార్మినార్ మజీద్, అబూబషర్ కాలనీ,బాలాజీ కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.